క్లుప్తంగా

శతాధిక వృద్ధురాలి మృతి



ముదినేపల్లి రూరల్: మండలంలోని గురజకు చెందిన శతాధిక వృద్ధురాలు శనివారం మృతి చెందింది. ముప్పిరిశెట్టి మాణిక్యమ్మ (105) వృద్ధాప్యం కారణంగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మాణిక్యమ్మకు కుమారుడు బాబూరావు, మనుమలు, మునిమనుమలు 15 మంది ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మాణిక్యమ్మ ఆధార్ కార్డు ప్రకారం వయస్సు 109 ఏళ్లు ఉండగా ఆమె కుటుంబ సభ్యులు గతంలో నమోదు చేసిన వివరాల ప్రకారం 105 ఏళ్లు ఉన్నట్లు బంధువులు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

పామర్రు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక సచివాలయం–1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం అక్టోబరు 10వ తేదీన పంచాయతీ కార్యాలయం వద్ద జరుగుతుందని తెలిపారు. శనివారం స్థానిక సచివాలయం–1 వద్ద వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పామర్రు మండల వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, పామర్రు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎంఎల్ హెచ్‌పీ దీప్తి, వైద్యసిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

పామర్రు: స్థానిక మూడవ ఎంపీటీసీ సిగ్మెంట్ పరిధిలోని 10వ వార్డు కోటిరెడ్డిపేటలో సీసీ రహదారి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు తాడిశెట్టి శ్రీనివాసరావు పనులను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కోటిరెడ్డిపేటలో పర్యటించి వార్డు అభివృద్ధికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో సీసీ రహదారి పనులు చేపట్టామన్నారు. వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, వార్డు మెంబర్ ఓబులశెట్టి కోటయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు కాకర్ల శివశంకర్, పీఆర్ ఏఈ ధర్మయ్య లు పాల్గొన్నారు.

చవితి ఏర్పాట్లకు అనుమతి తీసుకోవాలి

గుడివాడరూరల్(నందివాడ): నందివాడ మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న వినాయక చవితి పందిళ్లు, ఉత్సవాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని నందివాడ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి ఎస్‌ఐ ఎల్ఎస్ఎన్ మూర్తి శనివారం తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఉత్సవ కమిటీ నిర్వాహకులు తప్పనిసరిగా విగ్రహ ఏర్పాట్లు, మైక్ తదితర విషయాలకు సంబంధించి పోలీస్‌శాఖ అనుమతి తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ జాషువా, డీఎస్పీ పి.శ్రీకాంత్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో పోలీస్ సిబ్బంది పర్యటిస్తూ ఉత్సవ కమిటీ సభ్యులకు పోలీసుల అనుమతి తీసుకోవాలనే విషయంపై ఇప్పటికే అవగాహన కల్పించామన్నారు. నిమజ్జనం వివరాల గురించి కూడా ఉత్సవ కమిటీ సభ్యులు ముందుగా పోలీసులకు తెలిపితే నిమజ్జనం రోజు ఎటువంటి ఘర్షణలకు, గొడవలకు తావు లేకుండా ముందస్తుగానే పోలీసులు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని వివరించారు.

చవితి పందిళ్లకు అనుమతులు తప్పనిసరి

పమిడిముక్కల: వినాయక చవితి ఉత్సవాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్‌ఐ కిషోర్ కుమార్ తెలిపారు. పంచాయతీ, విద్యుత్, అగ్నిమాపక శాఖల అనుమతులు తీసుకోవాలన్నారు. రోజుకు రూ.100 యూజర్ చార్జీలు చెల్లించాలన్నారు. ఇప్పటివరకు 31 దరఖాస్తులు వచ్చాయన్నారు. గుడివాడ డీఎస్పీ నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని తెలియజేశారు.

కూచిపూడి(మొవ్వ): కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు కూచిపూడి పోలీస్ స్టేషన్ పరిధిలోని 21 గ్రామాల్లో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసే పందిర్లకు, మండపాలకు, ఉత్సవ నిర్వాహకులు ముందస్తుగా పోలీసుల అనుమతులు తీసుకువాలని కూచిపూడి ఎస్‌ఐ డీ సందీప్ సూచించారు. ప్రైవేటు స్థలాల్లో పందిర్లు ఏర్పాటు చేసే వారు యజమానుల అనుమతి, పంచాయతీ స్థలంలో విగ్రహాలు ఏర్పాటు చేసే వారు పంచాయతీ అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తినా పూర్తి బాధ్యత నిర్వాహకులు, కమిటీ సభ్యుల పై ఉంటుందని, అవాంఛనీయ ఘటనలు జరిగే అవకాశం ఉంటే ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలి

పామర్రు: ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా వలంటీర్లు పని చేయాలని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన వలంటీర్లకు నియామకపు ఉత్తర్వులను శనివారం అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేస్తూ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ఎలకుర్రు, నిభానుపూడి, కొమరవోలు, ఉరుటూరు గ్రామాలకు నూతనంగా ఎంపికైన వలంటీర్లకు నియామకపు ఉత్తర్వులను అందజేశారు. మండల సచివాలయ కన్వీనర్ ముప్పిడి సురేష్‌రెడ్డి, ఎంపీటీసీ పీరత్నకుమారి, సర్పంచ్ దిరిశం రత్నకుమారి, ఎంపీడీవో వై. రామకృష్ణ పాల్గొన్నారు.

చవితి ఏర్పాట్లు ముమ్మరం

- సిద్ధమవుతున్న మండపాలు
- కొలువుతీరనున్న గణనాథులు
- ఊపందుకున్న వినాయకుని విగ్రహాల కొనుగోళ్లు
- వివిధ రూపాల్లో దర్శనమిస్తున్న గణనాథులు
- సర్వత్రా సందడి వాతావరణం



అమ్మకానికి సిద్ధంగా ఉన్న గణనాథుడి విగ్రహాలు

గుడివాడరూరల్: వినాయక చవితి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. గుడివాడ, పామర్రు, కైకలూరు నియోజకవర్గాల పరిధిలో గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో మండపాలను సిద్ధం చేస్తున్నారు. వినాయక చవితి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించేందుకు గుడివాడ నియోజకవర్గంలోని గ్రామాల్లో భక్తులు సిద్ధమయ్యారు. ప్రతి ఏడాది మాదిరిగానే వినాయక చవితి వేడుకలు నిర్వహించేందుకు గ్రామాల్లో చలువ పందిళ్లను సిద్ధం చేసుకుంటున్నారు. గుడివాడ పట్టణంలోని నాగవరప్పాడు ప్రధాన సెంటర్‌లో అమ్మకాలకు గణనాథులు కొలువుతీరారు. జిల్లాతో పాటు పక్క జిల్లాల్లో వినాయకుడి విగ్రహాల తయారీకి పేరొందిన గ్రామాల్లో గత ఆరు నెలల నుంచి వినాయకుని విగ్రహాలను తయారీ చేసే కార్యక్రమాన్ని విగ్రహ తయారీదారులు నిగమ్నమయ్యారు. వివిధ రకాల రూపాల్లో వినాయక ప్రతిమలను సిద్ధం చేశారు.

విగ్రహాల కొనుగోళ్ల సందడి..

విగ్రహాల కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పట్టణంలోని నాగవరప్పాడు సెంటర్‌లో విగ్రహాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్ది అమ్మకానికి ఉంచారు. వివిధ రూపాల్లో వినాయకుని విగ్రహాలు రూపొంది అందరినీ ఆకర్షించే విధంగా ఉన్నాయి. నాగవరప్పాడు సెంటర్‌లో ఏర్పాటు చేసిన విగ్రహాలకు భక్తుల నుంచి డిమాండ్ పెరిగింది. పండుగ రెండురోజుల ముందుగానే గుడివాడ సందడి వాతావరణం నెలకొంది. విగ్రహాలను కొనుగోలు చేసేందుకు భక్తులు, కమిటీ సభ్యులు ఉత్సాహం చూపుతున్నారు. ఇప్పటికే విగ్రహాలను పెట్టేందుకు ముందుకు వచ్చిన ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్‌శాఖ అనుమతులు తీసుకుంటున్నారు.

అనుమతులు తప్పనిసరి..

> గుడివాడ సబ్ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాల ఏర్పాట్లలో భాగంగా విగ్రహాలు ఏర్పాటు చేసుకునే వారు జిల్లా ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు తప్పనిసరిగా సంబంధిత పోలీస్ స్టేషన్లలో అనుమతులు తీసుకోవాలి. నిమజ్జన కార్యక్రమాల్లో పోలీస్‌శాఖ సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి.
>
> –పి.శ్రీకాంత్, డీఎస్పీ, గుడివాడ



ఆకర్షణీయంగా గణనాథుడి విగ్రహం

విఘ్నేశ్వరాలయం వద్ద చలువ పందిళ్లు

గుడివాడరూరల్: స్థానిక మెయిన్‌రోడ్‌లో శ్రీవిఘ్నేశ్వరాలయంలో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ గంటా చంద్రశేఖర్ శనివారం తెలిపారు. దేవస్థానం వద్ద భక్తులతో కలసి చలువ పందిళ్లు వేసే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవ ఏర్పాట్లను దేవదాయశాఖ అధికారులు, కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు ప్రత్యేక క్యూలైన్‌లను ఏర్పాటు చేశామన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని గంటా కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గుడివాడ మెయిన్‌రోడ్‌లో విఘ్నేశ్వరాలయం వద్ద ఏర్పాటు చేస్తున్న చలువ పందిరి

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక

- బాబు జైలుకు వెళ్లడంతో దిక్కుతోచని స్థితిలో కార్యకర్తలు
- ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్



వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు: పామర్రు గ్రామంలోని నాయీబ్రాహ్మణ వీధిలోని టీడీపీ నాయకులు సత్యం (యేసుబాబు) తన అనుచరులు సుమారు 25 మందికి పైగా శనివారం పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. మండల పరిధిలోని జమీగొల్వేపల్లిలో జరుగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా అక్కడ తన అనుచరులతో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులకు వైఎస్సార్ సీపీలో సముచిత స్థానం ఇచ్చి గౌరవిస్తున్నామన్నారు. దీనికి ఆకర్షితులై ఆ సంఘ నాయకులు కార్యకర్తలు వైసీపీలోకి చేరుతున్నారని తెలిపారు. టీడీపీ నాయకుడు చంద్రబాబు జైలుకు వెళ్లడంతో ఆ పార్టీనేతలు దిక్కుతోచని స్థితిలో వలస వస్తున్నారని అన్నారు. తమ పార్టీ నాయకుడు తప్పు చేశాడు కాబట్టే జైలుకు వెళ్లటం జరిగిందని భావించిన టీడీపీ నేతలు ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై వస్తున్నారని అన్నారు. సత్యంతో పాటు ఏసుబాబు, పావులూరి రాకేష్, వినయ్, ఫణి, పవన్‌కళ్యాన్, అశోక్ తదితరులకు ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం అందరూ కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, తాడిశెట్టి శ్రీనివాసరావు,పి రత్నకుమారి, కుందేటి రాణి, శాంత కుమారిలు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- జమీగొల్వేపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల పత్రాలను వృద్ధురాలికి అందిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

జమీగొల్వేపల్లి(పామర్రు): అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించి, నిరుపేదల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి తోడ్పాటు అందిస్తున్నారని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని జమీగొల్వేపల్లి గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఇతర సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేదలైన వారు ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోందన్నారు. పేదలు ఆర్థికాభివృద్ధిసాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అడుగు వేస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చే విధంగా చర్యలు చేపడుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు వల్లభనేని బుల్లిబాబు, కొల్లి గోపాలకృష్ణ, వల్లభనేని నాగేశ్వరరావు, సర్పంచ్ శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడరూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే నాని స్వగృహంలో నియోజకవర్గంలో ఉన్న పలువురు ప్రజల సమస్యలను ఎమ్మెల్యే నాని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ప్రజల సమస్యల పట్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అంకిత భావంతో పని చేస్తుందన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని సత్వరమే పరిష్కారానికి కృషి చేయడమే తమ ధ్యేయమన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 175 సీట్లకు 175 సీట్లు సాధించడం ఖాయమన్నారు. ఎంత మంది ఎన్ఆర్ ఐలు వచ్చినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన ముందు దిగదుడుపేనన్నారు. గత ఎన్నికల్లో మాదిరిగా వలస వచ్చిన వారు చెంబు, చేట పట్టుకుని మరలా తమ సొంతగూటికి పరుగెత్తడం ఖాయమన్నారు. అనంతరం ఇటీవల గుడివాడ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్‌గా నియమితులైన చింతల భాస్కరరావును పలువురు వెలమ సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి పదవి ఇవ్వడం పట్ల వెలమ సామాజిక వర్గ సభ్యులు ఎమ్మెల్యే కొడాలి నానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మెరుగుమాల కాళి, మార్కెట్‌యార్డ్ మాజీ డైరెక్టర్ కలపాల కిరణ్, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవగాహన

గుడివాడరూరల్: వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను ఏర్పాటు చేయాలని కళజాత సభ్యులు వై.వీరయ్య, వై.నాగేంద్రం, వై.రవితేజ కోరారు. మండలంలోని బిళ్లపాడు గ్రామంలో విజయవాడ ప్రాంతీయ కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల మేరకు శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్లాస్టిక్ విగ్రహాల వలన కలిగే నష్టాలను నృత్య రూపకంలో వివరించారు. గుడివాడ కళాకారుల సమాఖ్య సభ్యులు, బిళ్లపాడు గ్రామస్తులు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

రిటైర్డ్ లైబ్రేరియన్ మృతి

కైకలూరు: విశ్రాంత గ్రంథాలయాధికారి అట్లూరి రాధాకృష్ణమూర్తి (90) అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతూ విజయవాడ ఆస్పత్రిలో శనివారం మృతి చెందారు. స్వగ్రామమైన శీతనపల్లిలో గ్రంథాలయం ఏర్పాటులో ఆయన కీలకపాత్ర పోషించారు. ఇదే గ్రంథాలయంలో ఆయన అధికారిగా పనిచేశారు. ఆయన భార్య కొన్నేళ్ల క్రితం మరణించారు. ఆయనకు కుమారుడు ఉన్నారు. పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ఆర్థికసాయం అందజేత

మండవల్లి: మండవల్లి సొసైటీలో రుణం తీసుకుని ఇటీవల మృతి చెందిన ఆగొల్లు శ్రీనివాసరావు సొసైటీ సభ్యుడు కావడంతో మట్టి ఖర్చుల నిమిత్తం ఆయన కుటుంబానికి రూ.10 వేలు సాయం అందజేసినట్టు శనివారం కోఆపరేటివ్ చైర్మన్ బొమ్మనబోయిన గోకర్ణయాదవ్ తెలిపారు. సర్పంచ్ మెండా ఝాన్సి, మెండా సురేష్, బోయిన సత్యనారాయణ, కరేటి గోవింద్, పీఏసీఎస్ కార్యదర్శి జి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఎమ్మెల్యే డీఎన్నార్



కైకలూరులో మహిళలకు పెరటి కోళ్లను అందిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: మహిళల స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెడుతోందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండల మహిళా సమైఖ్య సంఘాలకు 70 యూనిట్ల పెరటి కోళ్లను డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే డీఎన్నార్ శనివారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక్కో యూనిట్ విలువ రూ.4,500 ఉంటుందన్నారు. యూనిట్‌లో 8 పెట్టలు, 4 పుంజులతో పాటు 30 కిలోల దాణా, మెడికల్ కిట్ ఉంటుందన్నారు. మహిళలు వీటితో స్వయం ఉపాధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీసీలు సైథాని, విజయలక్ష్మి, జీఆర్‌పీ గణపతి, వెలుగు సిబ్బంది, డ్వాక్రా సంఘాలు సభ్యులు పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్: స్థానిక వెలుగు సమైఖ్య కార్యాలయం వద్ద మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన డ్వాక్రా గ్రూపు సభ్యులకు పెరటి కోళ్లను ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ శనివారం పంపిణీ చేశారు. మండలానికి 70 పెరటికోళ్ల యూనిట్లు మంజూరయ్యాయని ఆయన చెప్పారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సత్యనారాయణ, అల్లూరు సర్పంచ్ శీలం రామకృష్ణ, వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా ఓజోన్ డే

పామర్రు: స్థానిక యలమర్రురోడ్డులోని ఏఎస్ఎం హైస్కూల్‌లో ఓజోన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి పూజలు చేశారు. చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఓ జోన్ పొరని కాపాడేందుకు మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలను కృత్యాల రూపంలో చిన్నారులు ప్రదర్శించారు. ఏ పూర్ణచంద్రా రెడ్డి, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓజోన్ పొరపై అవగాహన ర్యాలీ

కైకలూరు: పర్యావరణ సంబంధ ఓజోన్ పొరపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రఘునాథ రెడ్డి చెప్పారు. ఓజోన్ డే సందర్భంగా కాలేజీ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓజోన్ పొరపై సెమినార్ నిర్వహించారు. వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. అధ్యాపకులు కె.రమేష్, ఎస్.శ్రీనివాసరావు, ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

ముగిసిన ప్రేరణ తరగతులు

నూతన విద్యా విధానం 2020 ప్రకారం యూజీసీ యూనివర్సిటీ గ్రాండ్స్ కమిషన్ నిబంధనల మేరకు స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాంలో 21 రోజులపాటు కాలేజీలో సాగిన ప్రేరణ తరగతులు శనివారంతో ముగిశాయి. కరిక్యులమ్, ఎక్స్‌ట్రా కరిక్యులమ్, విభిన్న సాంస్కృతులు, విద్యార్థులు నడుచుకోవాల్సిన తీరు, కమ్యూనికేషన్ స్కిల్స్, లీగల్ అవేర్‌నెస్, ప్రశ్నాపత్రాల మూల్యాంకనం, బ్యాంకింగ్ రంగం, యోగా వంటి పలు అంశాలపై నిపుణులు విద్యార్థులకు వివరించారు. విజేతలకు బహుమతులు అందించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ

గుడివాడరూరల్: విద్యార్థులు జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని గుడివాడ మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ పేర్కొన్నారు. స్థానిక వికెఆర్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో గుడివాడ శ్రీచైతన్య కళాశాల కల్చరల్ ఫెస్ట్ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి జీవితంలో ఉన్నతమైన స్థితిలో నిలబడాలని ఆకాంక్షించారు. మున్సిపల్ కమిషనర్, వన్‌టౌన్ సీఐ కె.ఇంద్ర శ్రీనివాస్ చేతుల మీదుగా ఉత్తమ ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకంతో పాటు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ కమిషనర్, సీఐలను సత్కరించి మెమోంటోలు అందజేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వినాయక ప్రతిమల పంపిణీ



పంపిణీకి సిద్ధం చేసిన గణేశ్ ప్రతిమల వద్ద ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం ఉదయం 8 గంటలకు మండవల్లి మండలం పెరికేగూడెం డాల్ఫిన్ పాలిమర్స్ ఫ్యాక్టరీ వద్దకు వచ్చి గణేశ్ ప్రతిమలను తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) శనివారం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాల్లో ఉత్సవ కమిటీ కోరిన విధంగా ఏటా వినాయక ప్రతిమలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. గణేశ్ ప్రతిమలను తీసుకువెళ్లడానికి వచ్చే భక్తులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ప్రతి ఇంటినీ సందర్శించండి

ఈవోఆర్డీ వెంకటేశ్వరరావు



పమిడిముక్కల: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఈవోఆర్డీ కొండేటి వెంకటేశ్వరరావు తెలిపారు. వలంటీర్లు, వైద్య సిబ్బంది ప్రతి ఇంటినీ సందర్శించి మ్యాపింగ్ చేయాలన్నారు. స్థానిక సచివాలయంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్షపై జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి, అవసరమైన వారికి ఏడు రకాల పరీక్షలు చేయాలన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రత్యేక హెల్త్ క్యాంపుల్లో స్పెషలిస్ట్ వైద్యులతో చికిత్స అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుర్విందపల్లి వంశీ, కార్యదర్శి కట్టా సుధాకర్, సీహెచ్ఓ ప్రియాంక, ఏఎస్ఎం లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



గుడ్లవల్లేరు: వైఎస్సార్ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు డోకాల కనకరత్నారావు ఇటీవల మృతి చెందారు. శనివారం సాయంత్రం ఆయన కుటుంబాన్ని గుడ్లవల్లేరు ఇందిరాకాలనీలో గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) పరామర్శించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ పాలేటి చంటి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శాయన రవి, ఆలయ చైర్మన్ శేషం గోపి, పార్టీ నేతలు పెనుమాల రంగారావు, నరహరిశెట్టి కిశోర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



నలంద మున్సిపల్ హైస్కూల్‌లో భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి

గుడివాడరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన రుచికరమైన భోజనాన్ని అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి అన్నారు. ముందుగా గుడివాడ పట్టణంలోని నలందా మున్సిపల్ హైస్కూల్, బిళ్లపాడు జెడ్పీ హైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని, బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ఆయా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేసి విద్యార్థులకు మేలు చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేస్తున్న పౌష్టికాహారాన్ని చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు సక్రమంగా అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, సోషల్ వెల్ఫేర్, సివిల్ సప్లయీస్ అధికారులు, సిబ్బంది, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపిక

గుడ్లవల్లేరు: జాతీయ స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని శనివారం ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ప్రసాద్ తెలిపారు. భీమవరం రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ ఆగస్టు 12, 13వ తేదీల్లో జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో తమ కాలేజీకి చెందిన ఎస్.బాజీ కాంస్య పతకం, పి.నాగ శ్రీవాణి స్పీడ్ స్ప్రిన్ట్ టీము రిలేలో వెండి పతకం, ఎస్.యేసుబాబు డబుల్ డచ్ టీము రిలేలో కాంస్య పతకం, స్పీడ్ స్ప్రిల్ట్ టీముల్లో జె.కార్తీక్, జి.ధనుంజయ్ వెండి పతకాలు, ఎస్‌కే ఇమ్రాన్ స్పీడ్ స్ప్రిల్ట్ టీములో వెండి పతకం, కె.ఉమామహేశ్వరి, వి.గ్రేస్ విజయ, కె.లక్ష్మి, టి.నిఖిల్ డబుల్ డచ్‌లో కాంస్య పతకాలను పొందారని చెప్పారు. విజేతలు ఈ నెల 30 నుంచి అక్టోబర్ 2వ తేదీల్లో మహారాష్ట్ర నాసిక్‌లో జరగబోయే జాతీయ స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో తలపడనున్నారని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోదండ రామారావు, పీడీలు మత్తి శివశంకర్, వెంకటేష్, పూజిత, శ్రీనివాస్, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు..

ముదినేపల్లి రూరల్: జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు మండలంలోని వడాలి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి ఎంపికయ్యాడు. ఈ స్కూల్లో పదో తరగతి చదువుతున్న ఎస్.మణికంఠ ఈ నెల 13న గురజ హైస్కూల్లో అండర్ 17 బాలుర విభాగంలో నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. నియోజకవర్గ పోటీలు కైకలూరు మండలంలో 15న జరగగా మణికంఠ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి ప్రధానోపధ్యాయుడు సీహెచ్ నాగమల్లేశ్వరరావు తెలిపారు. మణికంఠను ఇన్‌చార్జి హెచ్‌ఎం, పీడీ పి.భాస్కరరావు, ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు అభినందించారు.